క్లుప్తంగా

అభినందన



ప్రశంసాపత్రాన్ని అందుకుంటున్న డిపో-1 ఉద్యోగి వెంకన్న

అఫ్జల్‌గంజ్: తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థలో మూడేళ్లలో ఉత్తమ విధులు నిర్వహించిన ఉద్యోగులకు ప్రశంసాపత్రాలను అందజేశారు. గురువారం ఉద్యోగ సంక్షేమ మండలిలో భాగంగా ఉత్తమ సేవలు అందిస్తూ సంస్థ లక్ష్యాలు, అభివృద్ధికి పాటుపడిన హైదరాబాద్ డిపో-1 వెల్ఫేర్ బోర్డు సభ్యుడు, టైర్ మెకానిక్ వెంకన్నను టీఎస్ ఆర్టీసీ ఎండీ వీసీ సజ్జనార్ ప్రశంసా పత్రాన్ని అందజేసి అభినందించారు.

భక్తిశ్రద్ధలతో అయ్యప్ప మహా పడిపూజ



పూజలు చేస్తున్న బీఆర్‌ఎస్ నాయకుడు సంతోష్‌గుప్తా

అబిడ్స్: ఆదర్శ్‌నగర్‌లో గోషామహల్ బీఆర్‌ఎస్ నాయకుడు సంతోష్‌గుప్తా ఆధ్వర్యంలో గురువారం అయ్యప్పస్వామి మహా పడిపూజ భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. స్వామియే శరణమయ్యప్పా అంటూ అయ్యప్పస్వాముల శరణు ఘోషతో ప్రాంతం మారుమ్రోగింది. ఎమ్మెల్సీ బొగ్గారపు దయానంద్, బీఆర్‌ఎస్ నాయకులు జయశంకర్, శంకర్, గోషామహల్ నియోజకవర్గానికి చెందిన పలువురు పాల్గొన్నారు.

డ్రైనేజీ పైప్‌లైన్ పనుల ప్రారంభం



చాంద్రాయణగుట్ట: మజ్లిస్ పాలనలో పాతబస్తీ అభివృద్ధికి నోచుకోవడం లేదని బీజేపీ సీనియర్ నాయకుడు ఎర్రవెల్లి అశోక్ రావు అన్నారు. లలితాబాగ్ డివిజన్ మారుతీనగర్‌లోని బంగారు మైసమ్మ అమ్మవారి ఆలయ సమీపంలో నూతన డ్రైనేజీ పైప్‌లైన్ పనులను ఎర్రవెల్లి అశోక్ రావు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... పాతబస్తీ సమస్యలకు నిలయంగా మారిందన్నారు. పాతబస్తీని అభివృద్ధి చేయడానికి అధికారులు ప్రత్యేక శ్రద్ధ చూపాలన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు కృష్ణ, గోవింద్, గోకుల్‌రావు, వి.ఆర్.సింగ్, కాంట్రాక్టర్ నరేశ్, మారుతినగర్ కాలనీవాసులు తిరుమల రావు, దేవిదాస్, శారద, పద్మమ్మ, మణెమ్మ, నందా తదితరులు పాల్గొన్నారు.

యోగాతో సంపూర్ణ ఆరోగ్యం

అబిడ్స్: యోగాతో సంపూర్ణ ఆరోగ్యం లభిస్తుందని భారతీయ యోగ్ సన్‌స్తాన్ జోనల్ సెక్రటరీ రామారావు పేర్కొన్నారు. ఆయన జన్మదిన వేడుకలు గురువారం ఘనంగా జరిగాయి. యోగా సన్‌స్తాన్ సభ్యులు మహేష్ తివారి, మెట్టు వెంకటేష్‌తో పాటు పలువురు సభ్యులు ఆయన పుష్పగుచ్ఛం అందజేసి సత్కరించారు. అనంతరం జరిగిన సమావేశంలో రామారావు మాట్లాడుతూ.. ప్రతి ఒక్కరూ రోజుకు అరగంటైనా యోగా చేయాలన్నారు.

రమణీయం.. నవదుర్గ వైభవం

గన్‌ఫౌండ్రీ: నాట్యం నేర్చుకోవడం గొప్ప యోగమని తెలంగాణ రాష్ట్ర బీసీ సంక్షేమశాఖ ముఖ్య కార్యదర్శి బుర్రా వెంకటేశం అన్నారు. గురువారం రవీంద్రభారతిలో ప్రణవ్ కూచిపూడి నృత్య శిక్షణాలయం 16వ వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని పద్మశ్రీ డాక్టర్ పద్మజారెడ్డి శిష్యబృందం విజయ విలాసంతో నర్తించారు. అన్నమయ్య రామదాసు ఆది శంకరాచార్య కీర్తనలు, నవదుర్గ వైభవం, అష్టలక్ష్మి వంటి శాస్త్రీయ అంశాలపై 90 మంది నర్తకీమణులు చేసిన నృత్యాలను ఆహుతులను సమ్మోహనపరిచాయి. అనంతరం గురువులు వేదాంతం నాగవెంకట శాస్త్రీ, సురభి విజయలక్ష్మి, సురభి జితేందర్‌తో పాటు పలువురిని ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఎస్సీ సంక్షేమశాఖ కమిషనర్ యోగితారాణా, ఆదాయ డిప్యూటీ డైరక్టర్ జనరల్ సంగీత పాల్గొన్నారు.



నృత్యం చేస్తున్న కళాకారులు

కేలండర్ ఆవిష్కరణ



కేలండర్‌ను ఆవిష్కరిస్తున్న హోంమంత్రి మహమ్మూద్ అలీ తదితరులు

అఫ్జల్‌గంజ్: ప్రభుత్వ సంక్షేమ పథకాలపై విస్తృతంగా అవగాహన కల్పించేందుకు బీఆర్‌ఎస్ సీనియర్ నాయకుడు మహమ్మద్ అహ్మద్ అలీ చేస్తున్న కృషి అభినందనీయమని రాష్ట్ర హోంమంత్రి మహమ్మూద్ అలీ పేర్కొన్నారు. ఈ మేరకు గురువారం మినిస్టర్స్ క్వార్టర్స్‌లోని మంత్రి నివాసంలో బీఆర్‌ఎస్ నాయకులు మహమ్మద్ అహ్మద్, ఉస్మానియా ఆస్పత్రి ఆర్ఎంఓ డాక్టర్ మహమ్మద్ రఫీ ఆధ్వర్యంలో ప్రభుత్వ సంక్షేమ పథకాలతో రూపొందిచిన 2023 కేలండర్, డైరీ ఆవిష్కరణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన జహిరాబాద్ ఎంపీ బీబీ పాటిల్, ఎమ్మెల్సీ, ప్రభుత్వ విప్ ఎంఎస్ ప్రభాకర్‌రావు, బీఆర్‌ఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బండి రమేష్, సీనియర్ నాయకులు సీహెచ్. ఆనంద్‌కుమార్‌గౌడ్‌తో కలిసి కేలండర్, డైరీని ఆవిష్కరించారు.

ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి

గౌలిపురా: డివిజన్‌లోని ప్రజా సమస్యల పరిష్కారానికి నిరంతరం కృషి చేస్తున్నామని గౌలిపురా కార్పొరేటర్ భాగ్యలక్ష్మి అన్నారు. గౌలిపురా డివిజన్‌లోని గాంధీనికేతన్ బస్తీలో శ్రీనివాస స్కూల్ వద్ద గురువారం ఆమె నూతన సీసీ రోడ్డు పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ... బస్తీలో రోడ్డు శిథిలావస్థకు చేరుకోవడంతో ప్రజలు తన దృష్టికి తీసుకురావడంతో బస్తీవాసుల వినతి మేరకు రూ.4.75 లక్షలతో నూతన సీసీ రోడ్డు పనులను ప్రారంభించడం జరిగిందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం కార్పొరేటర్లకు ప్రత్యేక నిధులు కేటాయించకుండా అభివృద్ధిని అడ్డుకుంటుందన్నారు. బీజేపీ ఓబీసీ మోర్చా రాష్ట్ర అధికార ప్రతినిధి వెంకటేశ్, డివిజన్ బీజేపీ అధ్యక్షుడు రఘుకాంత్, బీజేపీ జిల్లా అధికార ప్రతినిధి సుమన్ కుమార్ ముదిరాజ్, మజ్దూర్ మోర్చా కన్వీనర్ జమాల్‌పూర్ అశోక్, సాయికృష్ణ, శైలేందర్‌రెడ్డి, బస్తీవాసులు సాయికుమార్, ప్రదీప్, వెంకటేశ్‌గౌడ్, పాల్గొన్నారు.

20, 21వ తేదీల్లో సిటీ కళాశాలలో అంతర్జాతీయ సదస్సు

చార్మినార్: ప్రభుత్వ సిటీ కళాశాలలో ఈ నెల 20, 21వ తేదీల్లో రెండు రోజుల పాటు అంతర్జాతీయ సదస్సును నిర్వహించనున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ పి.బాల భాస్కర్ తెలిపారు. ప్రభుత్వ సిటీ కళాశాల అల్యూమినీ కమిటీ, ఐక్యూఏసీ కమిటీల సంయుక్తాధ్వర్యంలో ఈనెల 6, 7వ తేదీల్లో నిర్వహించాల్సి ఉన్న ఈ అంతర్జాతీయ సదస్సును రాబోయే 20, 21వ తేదీల్లో నిర్వహించనున్నామన్నారు. కొన్ని సాంకేతిక సమస్యల కారణంగా గతంలో అనుకున్న విధంగా అంతర్జాతీయ సదస్సును వాయిదా వేసి 20, 21వ తేదీల్లో నిర్వహిస్తున్నామన్నారు.

ఎగ్జిబిషన్‌లో విద్యుత్ సమస్య తలెత్తకుండా చర్యలు



మాట్లాడుతున్న వినయ్‌కుమార్ ముదిరాజ్

అబిడ్స్: ఎగ్జిబిషన్‌లో విద్యుత్ సమస్యలు, షార్ట్‌సర్క్యూట్ సమస్యలు తలెత్తకుండా పకడ్బందీ చర్యలు చేపడుతున్నట్లు ఎగ్జిబిషన్ విద్యుత్ సబ్ కమిటీ కన్వీనర్ వినయ్‌కుమార్ ముదిరాజ్, అడ్వైజర్ సురేందర్‌జీ యాదవ్ పేర్కొన్నారు. ఎగ్జిబిషన్‌లో స్టాళ్ల విద్యుత్ నిర్వహణపై ఏర్పాటుచేసిన సమావేశంలో వారు మాట్లాడుతూ.. ప్రణాళికబద్ధంగా విద్యుత్ కనెక్షన్లను, విద్యుత్ సరఫరా కొనసాగిస్తున్నట్లు తెలిపారు. ఎగ్జిబిషన్ నలుమూలలా రద్దీ ఉండే ప్రాంతాలను గుర్తించి ఫడ్‌లైట్లను ఏర్పాటు చేసినట్లు వివరించారు. గతంలో విద్యుత్ బకాయిలు ఉన్నవారి వద్ద బకాయిలు వసూళ్లు చేస్తూ విద్యుత్ సరఫరా చేపడుతున్నట్లు తెలిపారు. ఈ ఏడాది ఎగ్జిబిషన్‌ను ప్రత్యేక విద్యుత్ దీపాలతో అలంకరించి సందర్శకులను అలరించే విధంగా చర్యలు చేపడుతున్నట్లు వారు పేర్కొన్నారు. విద్యుత్ సమస్యలు ఏ మాత్రం తలెత్తకుండా సిబ్బందిచే ప్రత్యేక నిఘా ఏర్పాటు చేశామన్నారు.

జేఎన్‌ఏఎఫ్‌ఏయూలో వార్షికోత్సవం



కార్యక్రమంలో సినీ దర్శకుడు బి.నర్సింగ్‌రావు, వైస్ చాన్సలర్ ప్రొఫెసర్ కవిత దరియానిరావు

విజయనగర్‌కాలనీ: దైనందిన జీవితంలోని ఒత్తిళ్లను తగ్గించి మానసిక వికాసాన్ని పెంపొందించే శక్తి లలిత కళలకు ఉందని ప్రముఖ సినిమా డైరెక్టర్ నర్సింగ్‌రావు అన్నారు. మాసబ్‌ట్యాంక్ జవహర్‌లాల్ నెహ్రూ ఆర్కిటెక్చర్ అండ్ ఫైనార్ట్స్ యూనివర్సిటీలో పెయింటింగ్ విభాగం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న వార్షికోత్సవాలను ఆయన యునివర్సిటీ వైస్ చాన్సలర్ ప్రొఫెసర్ కవిత దరియానిరావుతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. విభిన్నమైన కళాపిపాసి కలవారు లలిత కళల్లో రాణిస్తారన్నారు. నేర్చుకోవాలనే తపన, సృజనాత్మకత గల విద్యార్థులకు జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో సినిమా, టీవీ, ప్రింట్, ఎలక్ట్రానిక్ మీడియా రంగాల్లో అపారమైన ఉద్యోగ ఉపాధి అవకాశాలు ఉన్నాయన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులు ఏర్పాటు చేసిన వివిధ కళాకృతులు, ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. ఈ ఉత్సవాలు మూడు రోజుల పాటు కొనసాగుతాయని కార్యక్రమ నిర్వాహకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ ఫైనార్ట్స్ కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ గంగాధర్, పెయింటింగ్ విభాగాధిపతి ప్రీతి సంయుక్త, ఆనంద్‌గడప పాల్గొన్నారు.

టీబీని నిర్లక్ష్యం చేయొద్దు



టీబీ ఫుడ్ న్యూట్రిషన్ కిట్లను అందజేస్తున్న రెడ్ క్రాస్ సొసైటీ ప్రతినిధులు

చార్మినార్: టీబీ అంటు వ్యాధి అయినప్పటికీ సరైన జాగ్రత్తలు తీసుకొని సకాలంలో వైద్య సేవలు పొందితే వ్యాధిని పూర్తిగా నయం చేసుకోవచ్చునని హైదరాబాద్ జిల్లా బ్రాంచ్ ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ చైర్మన్ భీమ్‌రెడ్డి అన్నారు. ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ మేనేజింగ్ కమిటీ సభ్యురాలు వీరమణి ఆధ్వర్యంలో గురువారం చార్మినార్ వద్ద టీబీ పేషెంట్లకు ఫుడ్ న్యూట్రిషన్ కిట్లను అందజేశారు. ప్రధాన మంత్రి టీబీ ముక్త్ భారత్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా చార్మినార్ వద్ద జరిగిన పంపిణీ కార్యక్రమంలో భీమ్‌రెడ్డి ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. టీబీని నిర్లక్ష్యం చేయొద్దన్నారు. సమాజంలోని పేద ప్రజలను ఆదుకోడానికి ప్రభుత్వంతో పాటు స్వచ్ఛంద సంస్థలు ముందుకు రావాల్సిన అవసరముందన్నారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ విజయ్ భాస్కర్, మహ్మద్ రియాజుద్దీన్, వినయ్ కిశోర్, డాక్టర్ శ్రీదేవి, నర్సింహారెడ్డి పాల్గొన్నారు.

వేగంగా అభివృద్ధి పనులు: ఎమ్మెల్యే కౌసర్



పనులను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే కౌసర్

గోల్కొండ: కార్వాన్ నియోజకవర్గంలో అభివృద్ధి పనులు వేగంగా జరుగుతున్నాయని కార్వాన్ ఎమ్మెల్యే కౌసర్ మొహియుద్దీన్ అన్నారు. గురువారం ఆయన నానల్‌నగర్, టోలీచౌకీ డివిజన్లలో పర్యటించారు. ఆయా ప్రాంతాల్లో జరుగుతున్న డ్రైనేజీ పనులను ఎమ్మెల్యే పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కార్వాన్ నియోజకవర్గంలో రూ.290 కోట్లతో డ్రైనేజీ పనులు జరుగుతున్నాయన్నారు. ఈ డ్రైనేజీ పనులు పూర్తయితే కార్వాన్ నియోజకవర్గంలో డ్రైనేజీ సమస్యలు ఉండవని ఆయన అన్నారు. అంతేకాకుండా లంగర్‌హౌస్, టోలీచౌకీ, నానల్‌నగర్ డివిజన్లలో ముంపు, ముప్పు సమస్య శాశ్వతంగా తొలిగిపోతుందన్నారు. పనులను ఎప్పటికప్పుడు పరిశీలించాలని తాను అధికారులను ఆదేశించానన్నారు. పనుల్లో అవినీతిచోటు చేసుకోకుండా చూడాల్సిన బాధ్యత అధికారులకే ఉండాలని ఆయన అన్నారు.

సంక్రాంతి జాతర వేడుకలను ఘనంగా నిర్వహిస్తాం

గోల్కొండ: నానల్‌నగర్‌లోని శ్రీ కోవెల రంగనాయకస్వామి సంక్రాంతి జాతర వేడుకలు ఈసారి ఘనంగా నిర్వహిస్తామని ఆలయ కమిటీ మాజీ చైర్మన్ సోమారపు జనార్దన్ అన్నారు. గురువారం నానల్‌నగర్‌లోని తిరుపల్లిగడ్డలోని ఆలయం వద్ద ఆయన కమిటీ సభ్యులతో కలిసి ఏర్పాట్లను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.... ఎంతో ప్రాచీన చరిత్ర కలిగిన ఈ ఆలయానికి పూర్వ వైభవం తెచ్చేందుకు దేవాదాయశాఖ అధికారులతో కలిసి ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. ముందుగా ఆలయ గుండాన్ని భక్తులు స్నానం చేయడానికి సిద్ధం చేశామన్నారు. అదేవిధంగా వేడుకల సందర్భంగా మహిళలకు రంగోలి పోటీలు నిర్వహిస్తామని, దీనికోసం సైతం మహిళలతో కూడిన కమిటీని కూడా ఏర్పాటు చేస్తున్నామన్నారు. ఆలయ పునరుద్ధరణ పనులు వేగవంతం చేశామని, సంక్రాంతి వరకు ఆలయ నిర్మాణాన్ని పూర్తి చేసేందుకు జోరుగా నిర్మాణ పనులు జరుగుతున్నాయన్నారు. ఈ పనులను ఆలయ కార్యనిర్వాహణాధికారి శ్రీనివాసరాజు ఏర్పాట్లను పరిశీలిస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో నర్సింహ, విజయబాబు, అశోక్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

నుమాయిష్‌లో యూనియన్ బ్యాంక్ స్టాల్ ప్రారంభం



బ్యాంక్ స్టాల్‌ను ప్రారంభిస్తున్న బ్యాంక్, సొసైటీ ప్రతినిధులు

గన్‌ఫౌండ్రీ: యూనియన్ బ్యాంక్ ఖాతాదారులకు మెరుగైన సేవలందించేందుకు ఎంతగానో కృషి చేస్తున్నట్లు డిప్యూటీ జోనల్ హెడ్ అజయ్‌పాల్ తెలిపారు. గురవారం నాంపల్లి ఎగ్జిబిషన్ మైదానంలో జరుగుతున్న నుమాయిష్‌లో యూనియన్ బ్యాంక్‌ను స్టాల్‌ను ఆయన ముఖ్యఅతిథిగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఎగ్జిబిషన్‌కు వచ్చే సందర్శకుల కోసం రెండు ఏటీఎంలను ఏర్పాటు చేశామని, తమ బ్యాంక్ అందిస్తున్న సేవలను ప్రజలకు చేరువ చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో రిజినల్ మేనేజర్ శ్రీధర్‌బాబు, కోఠి రిజినల్ మేనేజర్ వినోద్‌కుమార్ రెడ్డి, ఎగ్జిబిషన్ సొసైటీ ఉపాధ్యక్షుడు అశ్వినిమార్గం పాల్గొన్నారు.

విద్యార్థులకు వేదాల పుట్టు పూర్వోత్తరాలపై అవగాహన



సంతోష్‌నగర్: కంచన్‌బాగ్‌లోని బీపీడీఏవీ పాఠశాల ప్రార్థన సభకు వేద గణిత ఉపాధ్యాయులు, సంఖ్యా వ్యవకలనంలో గిన్నీస్ రికార్డ్ సాధించిన సాయికిరణ్ హాజరై వేదాల పుట్టు పూర్వోత్తరాలను, వాటి ప్రాముఖ్యతను వివరించారు. గణితశాస్త్రం గురించి అధర్వణ వేదంలో చెప్పబడిందని.. నిత్య వ్యవహారంలోని అనేక అంశాలు గణితంపై ఆధారపడి ఉన్నాయని గుర్తు చేశారు. వేద గణితం ద్వారా కూడికలను సులువైన పద్ధతిలో ఎలా సాధించవచ్చో ఉదాహరణలతో విద్యార్థులకు బోధించారు. వేద గణితం పురాతమైన, విస్తృతమైన శాస్త్రమని, ఈ శాస్త్రంలో ఆర్యభట్ట, భాస్కరాచార్య, బ్రహ్మ గుప్తా, పావులూరి మల్లన్న వంటి నిష్ణాతులైన గణిత శాస్త్రజ్ఞులు ఎందరెందరో రాణించారని సూచించారు. వేద గణితం విద్యార్థులకు తమ మానసిక అవరోధాలను అధిగమించేందుకు ఉపకరిస్తుందని.. వేద గణితం అనేది భారతదేశంలోనూ, ప్రపంచమంతటా అందరి దృష్టిని ఆకర్షించిందని తెలియజేశారు. పాఠశాల ప్రార్థన సభకు విచ్చేసి విలువైన సమాచారాన్ని విద్యార్థులకు తెలియజేసిన సాయికిరణ్‌ను బీపీడీఏవీ పాఠశాల ప్రిన్సిపాల్ వి.ఎస్.ప్రశాంత్, డీఏవీ పాఠశాల ఏఆర్‌ఓ వసంత ఎస్.రామన్, పాఠశాల చైర్మన్ గౌరీ శంకర్‌రావు అభినందించారు. విద్యార్థులంతా వేద గణితం పట్ల ఆసక్తిని పెంచుకోవాలని ఆకాంక్షించారు.

దివ్యాంగురాలి జీవితంలో కొత్త వెలుగు



నాంపల్లి: పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం జానపద కళల శాఖలో ఎం.ఏ జానపద కళల శాఖలో విద్యనభ్యసిస్తున్న దివ్యాంగురాలైన కుమారి భాగ్యకు కృత్రిమ కాలును సమకూర్చడానికి వర్సిటీ ఉపాధ్యక్షుడు ఆచార్య తంగెడు కిషన్‌రావు ఆర్థిక సహకారం అందజేసి దివ్యాంగురాలు జీవితంలో కొత్త వెలుగును నింపారు. కుమారి భాగ్య దివ్యాంగురాలుగా ఉండి తెలుగు విశ్వవిద్యాలయం ఏర్పాటు చేసిన పలు కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొనడమే కాకుండా జానపద సంగీత నృత్యంలో అద్భుత ప్రదర్శనలిచ్చి పలువురిని ఆకట్టుకున్నారు. ఈ విషయాన్ని పరిశీలించిన వర్సిటీ ఉపాధ్యక్షుడు ఆచార్య తంగెడ కిషన్‌రావు ఆర్థిక సాయం అందించడమే కాకుండా సహృదయ దాతల సహకారంతో జర్మనీ సాంకేతిక పరికరంతో భాగ్య కృత్రిమ కాలుకు అయ్యే రూ.3 లక్షలను ఒట్టొబాక్ సంస్థ ప్రతినిధులకు గురువారం అందించారు. ఆర్థిక సహకారం అందించిన సప్తగిరి హోటల్స్ అధినేత రవికుమార్‌తో పాటు, ఇతర దాతలకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో వర్సిటి ఇన్‌చార్జి రిజిస్ట్రార్ ఆచార్య మురళీకృష్ణ, వర్సిటీ బాలికల వసతి గృహం వార్డెన్ డాక్టర్ వనజా ఉదయ్ పాల్గొన్నారు.

యువకుడికి 15రోజుల జైలు

డబీర్‌పురా: ఓపెన్‌టాప్ కారులో వెళ్తూ పోలీసులు తనిఖీలో ఆపకుడా వెళ్లిన ఓ వ్యక్తికి నాంపల్లిని 6వ స్పెషల్ మెట్రోపాలిటన్ మెజిస్ట్రేట్ కోర్టు 15 రోజుల సాధారణ జైలు శిక్ష విధిస్తూ గురువారం తీర్పునిచ్చింది. పోలీసుల వివరాల ప్రకారం... గతనెల 27న తెల్లవారుజామున మీర్‌చౌక్ ఏసీపీ ఆధ్వర్యంలో ఎతేబార్‌చౌక్ ప్రాంతంలో వాహనాల తనిఖీలు నిర్వహిస్తున్నారు. అదే సమయంలో శాలిబండకు చెందిన మహమ్మద్ బషీర్ అహ్మద్ (19) తన మెర్సిడెస్ బెంజ్ ఓపెన్ టాప్ కారులో వెళ్తున్నారు. అక్కడే విధులు పోలీసులు ఆపడానికి ప్రయత్నించగా ఆపలేదు. అక్కడే విధులు మీర్‌చౌక్ ఎస్సై జబ్బార్ గన్‌తో కారును ఆపాలని సూచించడంతో అప్పుడు కారును ఆపి పోలీసుల తనిఖీలకు సహకరించారు. దీనిపై పోలీసులు కేసు నమోదు చేసుకొని నిందితుడు మహమ్మద్ బషీర్ అహ్మద్‌ను గురువారం నాంపల్లిలోని 6వ స్పెషల్ మెట్రోపాలిటన్ మెజిస్ట్రేట్ కోర్టులో హాజరు పరచగా నిందితునికి 15 రోజుల జైలు శిక్ష విధిస్తూ తీర్పునిచ్చింది. దీంతో బషీర్‌ను పోలీసులు రిమాండ్‌కు తరలించారు.

పార్కింగ్ విషయంలో గొడవ.. ఇద్దరికి గాయాలు

డబీర్‌పురా: పార్కింగ్ విషయంలో గొడవలో ఇద్దరు యువకులు తీవ్రంగా గాయపడిన ఘటన రెయిన్‌బజార్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసుల వివరాల ప్రకారం.. డబీర్‌పురా మాతాకి కిడికి మార్కెట్ ప్రాంతంలో ఈ నెల 4న సోహేల్ అలీ, ఆదిల్ హుస్సేన్ ద్విచక్ర వాహనంపై వెళ్తున్నారు. దారిలో ఓ వాహనం అడ్డుగా ఉండటంతో వీరిద్దరూ కలిసి పక్కకు జరిపారు. వాహనానికి సంబంధించిన వ్యక్తి తన వాహనాన్ని ఎలా పక్కకు జరుపుతావు అంటూ తన స్నేహితులతో కలిసి సోహేల్ అలీ, ఆదిల్ హుస్సేన్‌పై దాడికి పాల్పడ్డాడు. ఈ దాడిలో తీవ్రంగా గాయపడిన సోహేల్, ఆదిల్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీనిపై కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. గాయాలకు గురైన వారిని చికిత్స నిమిత్తం ఉస్మానియా ఆస్పత్రికి తరలించారు.

డ్రంకన్ డ్రైవ్ కేసులో 31 మందికి జైలు

అబిడ్స్: గోషామహల్ ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్ పరిధిలో మద్యం సేవించి వాహనాలు నడుపుతున్న 31 మందికి జైలు శిక్ష విధిస్తూ మెట్రోపాలిటన్ 3వీపీ మెజిస్ట్రేట్ జ్యోతిర్మయి తీర్పు చెప్పినట్లు ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ ధనలక్ష్మి తెలిపారు. మరో ఇద్దరికి డ్రైవింగ్ లైసెన్స్ రద్దు చేసినట్లు వివరించారు. అదేవిధంగా 156 మంది వద్ద రూ.3,45,600 జరిమానా విధించినట్లు ఆమె వివరించారు.